కవిత అరెస్టు రాజకీయ కుట్రే

- బీఆర్ఎస్ నేతల ఆగ్రహం
- ఇది అప్రజాస్వామికమంటూ మండిపాటు

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్ట్ చేయడంపై ఆ పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో రాజకీయ కుట్రలో భాగంగానే ఆమెను అరెస్టు చేశారంటూ మండిపడుతున్నారు. కేసు విచారణలో ఉన్నందున అరెస్ట్ చేయబోమని సుప్రీం కోర్టుకు మాట ఇచ్చి... ఇప్పుడెలా తప్పుతున్నారని ప్రశ్నిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు రోజే అరెస్టు చేయడం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని పేర్కొంటున్నారు. బీఆర్ఎస్ పార్టీని, కేసీఆర్‌ను నైతికంగా దెబ్బ తీసే ప్రయత్నయని, ఇది అప్రజాస్వామికం, అనైతికం, అక్రమమని తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్సీ కవిత

కుట్రలాగే అనిపిస్తున్నది

ఆసిఫాబాద్, మార్చి 15 : ఎమ్మెల్సీ కవితపై కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోంది. కేసీఆర్ కుటుంబాన్ని బద్నాం చేసేందుకు ఈడీ ఇతర సంస్థలను అడ్డుపెట్టుకొని ఇబ్బందులకు గురి చేస్తున్నది. మొదట తనిఖీల కోసం అని చెప్పి వచ్చి.. అప్పటికప్పుడే అరెస్టు చేయడం వెనుక ఏదో కుట్ర దాగి ఉన్నట్లే అనిపిస్తున్నది. ఇదంతా ప్రజలు గమనిస్తున్నారు. రాజకీయంగా ఎదుర్కోలేక ఇలాంటి కుట్రలు చేయడం సరికాదు.

- కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆసిఫాబాద్

అరెస్టు బాధాకరం

ఆసిఫాబాద్, మార్చి 15 : బీజేపీ కావాలనే కేసీఆర్ కుటుంబాన్ని టార్గెట్ చేస్తున్నది. తనిఖీల కోసమని వచ్చి.. ఆ వెంటనే అరెస్టు చేయడాన్ని బట్టి చూస్తే కచ్చితంగా ఏదో కక్షసాధింపు చర్యలాగే కనిపిస్తున్నది. కేంద్రంలో అధికారం ఉందని కవితను అరెస్ట్ చేయించేందుకు ఈడీపై ఒత్తిడి తీసుకు వచ్చినట్లు అనిపిస్తున్నది. ఇది అప్రజాస్వామికం. బాధాకరం. ఎన్నికుట్రలు చేసినా బీజేపీని ప్రజలు నమ్మే స్థితిలో లేరు.

- అరిగెల నాగేశ్వర్‌రావు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి

తనిఖీలని వచ్చి అరెస్టా?

మంచిర్యాలటౌన్, మార్చి 15 : కేవలం రాజకీయ కుట్రతోనే ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేశారు. ఏడాదిన్నర కిందటే లిక్కర్ స్కాంలో కేవలం సాక్షిగా మాత్రమే పేరును చేర్చారు. ఈ నెల 19న సుప్రీంకోర్టులో కేసు విచారణలో ఉండగానే తనిఖీల పేరుతో వచ్చి అరెస్టు చేయడం సరికాదు. శనివారం లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ దృష్ట్యా మోదీ సర్కారు సాగిస్తున్న అరాచకంగానే దీనిని భావిస్తున్నాం. ఇదంతా ప్రజలు గమనిస్తున్నారు. మోదీ సర్కారు తగిన మూల్యం చెల్లించక తప్పదు.

- నడిపెల్లి దివాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే, మంచిర్యాల

ఆమె నిర్దోషిగా బయటకు వస్తారు

మంచిర్యాలటౌన్, మార్చి 15: ఎమ్మెల్సీ, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత అరెస్టు అప్రజాస్వామికం. ముందుగా ఇంట్లో తనిఖీలు అని చెప్పి వచ్చిన ఈడీ అధికారులు సాయంత్రానికి అరెస్టు వారెంటు జారీ చేయడం వెనుక పెద్ద రాజకీయ కుట్రకోణం దాగి ఉన్నట్లుగానే భావిస్తున్నాం. పార్లమెంటు ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందురోజు అరెస్టు చేయడం వెనుక ఆంతర్యమేమిటి. మహిళ అని కూడా చూడకుండా రాత్రిపూట అరెస్టు చేయడం శోచనీయం. తెలంగాణ సమాజమంతా కవితక్కకు మద్దతుగా నిలుస్తుంది. ఆమె నిర్దోషిగా బయటకు వస్తారన్న నమ్మకం ఉంది.

- గాదెసత్యం, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు, మంచిర్యాల

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



కెరమెరి: పశువులకు గాలికుంటు నివారణ టీకా వేస్తున్న ఎంపీపీ మోతీరాం

కెరమెరి, మార్చి 15: మండలంలో నిర్వహించే పశు వైద్య శిబిరాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పెందోర్ మోతీరాం అన్నారు. శుక్రవారం కెరమెరి పశు వైద్య శాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పాల్గొని పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ వైద్య శిబిరాలు వచ్చే నెల 10 వరకు ప్రతి గ్రామాల్లో నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్య సహాయకురాలు సోనియా, సిబ్బంది సురేశ్, రాజ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

పుంజుమేరగూడలో..

రెబ్బెన, మార్చి 15: పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రెబ్బెన జడ్పీటీసీ వేముర్ల సంతోష్ సూచించారు. పుంజుమేరగూడలో శుక్రవారం పశు వైద్య శిబిరం ఏర్పాటు చేసి 234 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసిన అనంతరం మాట్లాడారు. ఇక్కడ రెబ్బెన ఎంపీటీసీ పెసరి మధు నయ్య, డాక్టర్ సాగర్, నాయకుడు జుమ్మిడి అనంద రావు తదితరులు ఉన్నారు.

పశువులకు గాలికుంటు నిరోధక టీకాలు

బెజ్జూర్, మార్చి 15 : మండల కేంద్రంలో శుక్రవారం పశువైద్య సహాయకుడు జితేందర్ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు నిరోధక టీకాలు వేశారు. ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా, గోపాల మిత్ర మనోహర్, నాయకులు జావీద్ అలీఖాన్, మాజీ సర్పంచ్ సుగుణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డీఎంగా విశ్వనాథ్

బాధ్యతలు స్వీకరిస్తున్న విశ్వనాథ్

ఆసిఫాబాద్, మార్చి15: ఆర్టీసీ డిపో మేనేజర్‌గా విశ్వనాథ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన శ్రీధర్ రాణిగంజ్ డిపోకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా డీఎం విశ్వనాథ్ మాట్లాడుతూ డిపో అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు. ఆర్టీసీ బస్సులను ప్రజలు ఆదరించాలని కోరారు. ప్రైవేటు వాహనాలను ఆశ్రయించకుండా ఆర్టీసీ సర్వీసుల్లో ప్రయాణం చేయాలని సూచించారు. డీఎంకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

అడిగినవారందరికీ ఉపాధి

లింగాపూర్, మార్చి 15: జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా అడిగినవారందరికీ పనులు కల్పిస్తామని ఈజీఎస్ ఈసీ వినోద్ కుమార్ తెలిపారు. మాన్కుగూడలో ఉపాధి హామీ పనులను శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. కొలతల ప్రకారం పనులు చేయించి, ప్రతి కూలీకి రూ.200 కూలి వచ్చేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట క్షేత్ర స్థాయి సిబ్బంది రామకృష్ణ, సంజీవ్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌటాల, మార్చి 15: కౌటాల సబ్ స్టేషన్ పరిధిలోని విజయనగరం ఫీడర్, గుండాయిపేట సబ్ స్టేషన్‌లోని గుడ్లబోరి ఫీడర్‌లోని 11 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు ఏఈ రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుడ్లబోరి, వైగాం, టేకంగూడ, రణవెల్లి, విజయనగరం, తాటినగర్ గ్రామాలక్లు వినియోగదారులు సహకరించాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే కుమారుడిపై ఫిర్యాదు

కాగజ్‌నగర్, మార్చి 15: సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కుమారుడు కోనేరు వంశీపై శుక్రవారం డీవైఎఫ్ఐ నాయకులు రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువారం కాగజ్‌నగర్‌కు వచ్చిన మంత్రి సీతక్కకు జిల్లాలోని సమస్యలపై వినతి పత్రం ఇవ్వడానికి వెళ్లగా వంశీ డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తం, సహాయకార్యదర్శి సతీశ్‌పై దురుసుగా ప్రవర్తించారన్నారు.

బదీలీలు ఉద్యోగంలో భాగమే

సతీశ్‌బాబును సన్మానిస్తున్న బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్

రెబ్బెన, మార్చి 15: సింగరేణి లో విధులు నిర్వహిస్తున్న అధికారులకు బదీలీలు ఉద్యోగంలో భాగమేనని బెల్లంపల్లి ఏరియా జీఎం రవి ప్రసాద్ స్పష్టం చేశారు. బెల్లంపల్లి ఏరియా లోని గోలేటి జీఎం కార్యాలయంలో శుక్రవారం బెల్లంపల్లి ఏరియా సివిల్ డీజీఎంగా విధులు నిర్వహించి కార్పొరేట్ కార్యాలయానికి బదిలీపై వెళ్తున్న సతీశ్‌బాబును ఏరియా జీఎం రవిప్రసాద్ ఏరియాలోని సివిల్ కాంట్రాక్టర్లతో కలిసి సన్మానం చేశారు. కార్యక్రమంలో సివిల్ ఈఈ రాజేంద్రప్రసాద్, ఏరియా కాంట్రాక్టర్లు గోపీకృష్ణారెడ్డి, తిరుపతి, పైడిధర్, మురళి, మహీధర్‌గౌడ్, సాగర్‌గౌడ్, రాజు, శ్రీనివాస్ ఉన్నారు.

ప్రభావిత ప్రాంతాల వారికి ప్రాధాన్యత

రెబ్బెన, మార్చి 15: సింగరేణి ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా సింగరేణి ప్రభావిత ప్రాంతాలు, భూనిర్వాసితులకు ప్రాధాన్యత ఇవ్వాలని బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్ సూచించారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్‌హాల్లో శుక్రవారం బెల్లంపల్లి ఏరియా కాంట్రాక్టర్స్, సివిల్ డిపార్టుమెంట్ ఉద్యోగులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికులుగా 80 శాతం స్థానికులకు అవకాశం కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో డీజీఎం(సివిల్) సతీశ్‌బాబు, ఈఈ(సివిల్) రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

వాంకిడి,మార్చి15: ఇంట్లో ప్రమాదవశాత్తు జారిపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన వాంకిడి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సాగర్ తెలిపిన వివరాల ప్రకారం, మండల కేంద్రంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన పగ్గే కొండయ్య (53) ఈ నెల 11న ఉదయం 9 గంటలకు తాను పని చేసే స్థలంలో జ్వరం రావడంతో సీఎస్‌సీకి వెళ్లి వైద్యం చేయించుకుని ఉదయం11గంటలకు ఇంటికి వెళ్లి పడుకున్నాడు. మధ్యాహ్నం 2 గంటలకు మంచంపై నుంచి కింద పడిపోవడంతో తీవ్ర గాయాలు కాగా అతని భార్య కవిత కరీంనగర్‌కు తరలించారు. అక్కచి నుంచి మెరుగైన వైద్యం కోసం ఎంజీఎం వరంగల్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం 10 గంటలకు మృతి చెందాడు. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు.

పంటల పరిశీలన

చింతలమానేపల్లి, మార్చి 15 : మండలంలోని బాలాజీ అనుకోడ, రుద్రాపూర్, చింతలమానేపల్లిలో వ్యవసాయ అధికారి రామకృష్ణ పర్యటించి పంటలను పరిశీలించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు ప్రభావం ఉందని, రైతులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏఈవోలు విజయ్, శ్రీలత, రైతులు ఉన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

- మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)
- ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటన
- జోడేఘాట్‌లో భీంకు నివాళి
- పాల్గొన్న ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు, జడ్పీ చైర్మన్ కృష్ణ, కలెక్టర్

జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కోవలక్ష్మితో కలిసి గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

ఆసిఫాబాద్/కెరమెరి, మార్చి 15 : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి దనసరి అనసూయ (సీతక్క) పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని కలెక్టర్ వెంకటేశ్ దౌత్రే, అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు, జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణ, ఎమ్మెల్యే కోవలక్ష్మితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రూ.1.50 కోట్లతో నిర్మించిన కేంద్ర గ్రంథాలయంలో అన్ని వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలో గిరిజన విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కుమ్రం భీం స్టడీ సర్కిల్‌ను సందర్శించారు. విద్యార్థులను పోటీ పరీక్షలకు సిద్ధం చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఆ తర్వాత గుండి వంతెనను పరిశీలించారు. వంతెన నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సురేశ్‌కుమార్, జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్, డీఆర్వో లోకేశ్వర రావు, అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, డీఎస్పీ సదయ్య, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి సదానందం, డీపీవో భిక్షపతి, డీఆర్‌డీవో సురేందర్, స్టడీ సర్కిల్ నిర్వాహకులు ఊషన్న, రాజశేఖర్ పాల్గొన్నారు.

జోడేఘాట్ సందర్శన

కెరమెరి మండలం జోడేఘాట్ గ్రామాన్ని మంత్రి సీతక్క.. జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణా రావు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, కలెక్టర్ వెంకటేశ్ దౌత్రే, ఎస్పీ సురేశ్‌కుమార్, అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి సందర్శించారు. కుమ్రం భీం, కుమ్రం సూరు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుమ్రం భీం స్మారక మ్యూజియాన్ని సందర్శించారు. కుమ్రం భీం సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో భీం మనుమడు కుమ్రం సోనేరావ్, జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణరావు, డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు, కాంగ్రెస్ నాయకులు గణేశ్ రాథోడ్, ఆజ్మీర శ్యానాయక్, ఆత్రం సుగుణ, తహసీల్దార్ దత్తు ప్రసాద్, మ్యూజియం అసిస్టెంట్ క్యూరేటర్ దుందేరావ్, కుమ్రం భీం ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పెందోర్ రాజేశ్వర్, అధికారులు, జిల్లా, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు. వాంకిడి సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కెరమెరి ఎస్ఐ విజయ్ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

కౌటాల: ముత్తంపేట జడ్పీఎస్ఎస్‌లో పది విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్‌లు పంపిణీ చేస్తున్న ఎస్ఐ మధుకర్, కాగజ్‌నగర్: విద్యార్థులకు ఫైల్స్ అందజేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

తిర్యాణి,మార్చి 15: ప్రణాళికా బద్ధంగా నిరంతరం కృషి చేస్తే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఎంఈవో వెంకటేశ్వర స్వామి విద్యార్థులకు సూచించారు. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రశాంతంగా పరీక్షలు రాసి మంచి జీపీఏ సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అంజయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాస్, అమరేందర్ రెడ్డి, దత్తమూర్తి, శ్రీధర్, మంజుల, ఎంఆర్‌సీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భయం లేకుండా పరీక్షలు రాయాలి

కౌటాల, మార్చి 15: పదో తరగతి విద్యార్థులు భయం లేకుండా వార్షిక పరీక్షలు రాయాలని కౌటాల ఎస్ఐ మధుకర్ సూచించారు. శుక్రవారం ముత్తంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులను పంపిణీ చేసి మాట్లాడారు. పరీక్షలంటే భయం ఉండకూడదని, చదివిన దానిని స్పష్టంగా రాయాలన్నారు. ప్రశ్నా పత్రాన్ని ఒకటికి రెండు సార్లు చదివి ఆ తరువాత వచ్చిన సమాధానాలను ముందుగా రాయాలని తెలిపారు. ఉన్నత చదువులకు పదో తరగతి ఫలితాలే కీలకమని, ప్రతి క్షణాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం హెచ్ఎం హన్మంతు ఆధ్వర్యంలో ఎస్ఐ మధుకర్, ఎంఈవో సోమయ్యను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో గుండాయిపేట కాంప్లెక్స్ హెచ్ఎం గోడం నానాజీ, సీఆర్‌పీ ప్రకాశ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి

కాగజ్‌నగర్, మార్చి 15: భయాన్ని వీడి కష్టపడి చదివి పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎటూకూరి శ్రీనివాస్ రావు సూచించారు. కాగజ్‌నగర్ మండలం గజ్జిగూడ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులకు పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం సర్టిఫికెట్ భద్రపరుచుకునే ఫైల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో మెరుగైన జీపీఏ సాధించి గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తేవాలన్నారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి, పీఆర్‌టీయూ మండల ప్రధానకార్యదర్శి శ్రావణ్‌కుమార్, నాయకులు సరస్వతీ రావు, మనోజ్‌కుమార్, శుభాకర్, మొండయ్య, వనిత, అన్నపూర్ణ, సునీత, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు

బెజ్జూర్, మార్చి 15 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 9వ తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. హెచ్ఎం సునీత, కస్తూర్బా ఎస్వో అరుణ, ఎంపీటీసీ పర్వీన్ సుల్తానాతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఉపాధ్యాయులు అతిథులను సత్కరించారు. పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు మండల విలేకరులు ప్యాడ్లు, పెన్నులు బహూకరించారు. అనంతరం విద్యార్థులు నృత్య ప్రదర్శనలతో అలరించారు. ఆశ్రమమోన్నత పాఠశాల హెచ్ఎం మారుబాయి, నాయకుడు జావీద్ అలీఖాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరీక్షలంటే భయం వీడాలి

వాంకిడి, మార్చి15 : విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలని ప్రధానోపాధ్యాయుడు నటరాజ్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పది విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా వీడ్కోలు

కాగజ్‌నగర్ టౌన్, మార్చి 15 : చింతగూడలో జడ్పీఎస్ఎస్‌లో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం వాసాల ప్రభాకర్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆలరించాయి. విద్యార్థులకు పాఠశాల బృందం పరీక్ష సామగ్రి అందజేశారు.

పాఠశాల వార్షికోత్సవం

దహెగాం, మార్చి 15 : చినరాస్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం రాత్రి పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు పలికారు. ఇక్కడ హెచ్ఎం సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తిర్యాణి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థులు , బెజ్జూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఈ పాఠశాలకు నిబంధనలు వర్తించవా!

పెంచికల్ పేట్, మార్చి15 ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 23 వరకు ఒంటి పూట బడులను నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12. 30 గంటల వరకు ఒంటిపూట బడులను నిర్వహించాలని సూచించింది. కానీ శుక్రవారం కమ్మర్‌గాం ప్రాథమిక పాఠశాల ఉదయం 9.30 గంటలు దాటినా ఉపాధ్యాయుడు రాకపోవడంతో తెరుచుకోలేదు. పక్కనే ఆశ్రమ పాఠశాల ఉండడంతో విద్యార్థులు అక్కడే కూర్చున్నారు. 9.30 గంటల తర్వాత పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయుడు తిరిగి మధ్యాహ్నం 12 గంటలకే వెళ్లిపోయారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంఈవో రమేశ్ బాబును ఫోన్ ద్వారా వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి రాలేదని, సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

పెంచికల్ పేట్: ఎల్లూరు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న టీచర్ భూలక్ష్మి

పెంచికల్‌పేట్, మార్చి15: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని అంగన్‌వాడీ టీచర్ భూలక్ష్మి పేర్కొన్నారు. ఎల్లూరు అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం పోషకాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న పాలు, గుడ్లు తీసుకోవాలని సూచించారు. ఆకుకూరలు, చిరుధాన్యాలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం బాలామృతం, పాలు, గుడ్లు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వ్వాడీ టీచర్లు సరోజ, శకుంతల, ఆయాలు, కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

రెబ్బెన: మాట్లాడుతున్న రెబ్బెన ఎంపీపీ జుమ్మిడి సౌందర్య

రెబ్బెన, మార్చి 15: పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవడంతోనే ఆరోగ్యం బాగుంటుందని రెబ్బెన ఎంపీపీ జుమ్మిడి సౌందర్య స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం గంగాపూర్ సెక్టార్‌లోని అంగన్‌వాడీ టీచర్లు పోషణ్ బీ, పడాయి బీ కార్యక్రమం నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ మాట్లాడారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంపీపీని సన్మానించారు. కార్యక్రమంలో గంగాపూర్ ఎంపీటీసీ హరిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

చిరుధాన్యాల ప్రదర్శన

తిర్యాణి, మార్చి 15: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యశోద, పంచాయితీ కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. గడలపల్లి గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సమతుల ఆహారంపై అవగాహన కల్పించారు. అనంతరం చిరుధాన్యాలతో పలు రకాల ఆహారపదార్థాలను తయారు చేశారు. వాటి ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ దుర్వ చిత్రు, మడావి జలపతిరావు పాల్గొన్నారు.

పోషక పదార్థాలపై అవగాహన

దహెగాం, మార్చి 15 : ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేసే పోషకాహారాలను తీసుకొని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనసూర్య సూచించారు. శుక్రవారం ఐనం అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శారద, ఆయా గౌరుబాయి, గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలు అందేలా చూడాలి

చింతలమానేపల్లి, మార్చి 15 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ పథకాలు అందేలా చూడాలని కోరుతూ శుక్రవారం బాబాసాగర్ గ్రామానికి చెందిన లబ్ధిదారులు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు తమకు అందడంలేదని తెలిపారు. ఇక్కడ గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

వాంకిడి,మార్చి15:మండలంలోని చిచ్‌పల్లి గ్రామానికి చెందిన పెందుర్ ప్రభు (30)శుక్రవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తె